వంశవృక్షం

[కథానిక]

= శ్రీ బుర్రా వెంకటసుబ్రహ్మణ్యం =

మూలపేటగ్రామంలో ఒక ఘోరమైన విపత్తు సంభవించింది. తెల్లవారకుండానే రామస్వామి అనే ఆసామి ఊరివెలుపలికి వెళ్తుంటే అతనికి పొదలసందులో రక్తమయమైన మృతకళేబరం ఒకటి కనపడింది. నిర్ఘాంతపోయి వెనక్కి తిరిగి, గ్రామంలోకి పరుగెత్తి, మొదట తన భార్యకీ, తర్వాత తనమామగారికీ, ఆఖరికి గ్రామమునసబుకీ ఆ సంగతి చెప్పేడు. అరగంటలో గ్రామం యావత్తూ శవంచుట్టూ మూగింది. శవం వీరన్నకొడుకుది. పాపం, ఏడేళ్లయినా నిండలేదా కుర్రాడికి. ఎవరో మెడ సగం నరికేసేరు. రక్తపుబొట్లు జిగటగా ఇంకా నేలమీదికి కారుతున్నట్టే ఉన్నాయి. గ్రామంలోవాళ్లు చాలామంది ఆ ప్రదేశంలో చేరిన తర్వాత వీరన్నా, అతని భార్య లక్ష్మాయీ, వాళ్ల చిన్నకూతురూ వచ్చారు. వీరన్న దుఃఖం ఆపుకోలేక, చచ్చిపోయిన కొడుకు రెండు చేతులూ పట్టుకుని ముద్దుపెట్టుకుంటూ, కొడుకు గుండెమీద తల వాల్చి 'అయ్యో, అయ్యో' అని మొర్రపెట్టూ, ఏకధారగా ఏడ్చేడు.

వీరన్నంటే గ్రామానికంతకీ అభిమానం. పుట్టినది సామాన్యపు వ్యవసాయపు కుటుంబంలోనైనా, నడతలోనూ, ఠీవిలోనూ, బుద్ధిలోనూ, ధైర్యసాహసాలలోనూ ఎవరికైనా సిగ్గురప్పించగలిగినవాడు. శరీరచ్ఛాయ నలుపేకాని, ముఖంలో కళాకాంతులున్నాయి. వీరన్నభార్య లక్ష్మాయికూడా చాలా యోగ్యురాలు. వీరన్నకి భార్య అంటే ఇంతా అంతా కాదు ప్రేమ. అంత అందమైన స్త్రీ ఈలోకంలో లేదని వీరన్నగర్వం. దాల్లపూడిగ్రామంలో పెళ్లి చేసుకునివచ్చి మూలపేటగ్రామంలో కాపురంచేస్తున్న మొదటిరోజులలో లక్ష్మాయికేసి ఎవరినీ చూడనిచ్చేవాడు కాదు. ఆరోజులలో లక్ష్మాయి మేనమామకొడుకొకడు మూలపేటప్రాంతాలలో ఉండడం తటస్థించి మేనత్తకూతురు నొకసారి చూసిపోదామని వస్తే, తను గుడిసెలో లేనప్పుడు తన భార్యని చూడడానికి వచ్చాడన్న వెర్రికోపం పెట్టుకుని, వీరన్న లక్ష్మాయిచుట్టాన్ని కొట్టేసరికి, లక్ష్మాయిచుట్టం మూడురోజులవరకూ మాట్లాడలేకపోయాడనీ, తిండి తినలేకపోయాడనీ అందరికీ తెలిసినకథే. కాని పెద్దవాడయినకొలదీ ఇటువంటి వెర్రులన్నీ పోయి వీరన్నకి నెమ్మదీ, పొక్తావారీతనం పట్టుబడ్డాయి. ఈ మార్పు చూసి గ్రామంలో అందరూ ఆశ్చర్యపడ్డారు. చుట్టుపట్ల ఉన్న గ్రామాలన్నిటిలోనూ వీరన్నంత పెద్దమనిషి కాని, వీరన్నంత చాకచక్యం గలవాడుకాని ఎవడూ లేడని అతనికి పేరొచ్చింది.

సుమారు ఏడేళ్లయింది లక్ష్మాయికి నాగన్న పుట్టి. తల్లిదండ్రులలాగే నాగన్నకూడా అందమైనవాడు. కాని కుర్రవాడికి తల్లిదండ్రులకు లేని శరీరచ్ఛాయ వచ్చింది. పండుతూఉన్న జామపండురంగు. చూసీ చూడగానే, క్షత్రియకులమో, బ్రాహ్మణకులమో అన్నట్టుండేవాడు. మూలపేటకి దగ్గరలోనే ఒక గ్రామంలో బ్రాహ్మణపురోహితు డొకాయన ఉన్నాడు. ఆయనపిల్లల్ని చూసి ఎవరైనా కాపువాళ్లనుకునేవారు కాని, నాగన్నని చూసి ఎవరూ రైతుకుర్రవాడని చెప్పగలిగేవారు కారు. నాగన్నకి చక్కని ముక్కు, పెద్దనుదురు, చారెడేసి కళ్లు! తల్లికీ తండ్రికీ కొడుకంటే చెప్పరాని గారాబం. అదీకాక ఈ కుర్రవాడు పుట్టిన నాలుగైదేళ్లవరకూ లక్ష్మాయికి పిల్లలు లేరు. అప్పుడు రామి పుట్టింది. అందువల్లకూడా అంతగారాబంగా పెరిగేడు నాగన్న. ఏడేళ్లు పెరిగేడు. ఘోరంగా చచ్చిపోయాడు.

లక్ష్మాయి రామిని దింపి, తన కొడుకు పొట్టని కొడుకు కడుపునిండా అన్నం తిన్నప్పుడు ఆ పొట్టని తడిమినట్టు తడిమి, ఒక్కసారి గుక్క తిరక్కుండా ఏడ్చేసి, లేచి, కళ్లు కొంగుతో తుడుచుకుంటూ, రామిని మళ్లీ ఎత్తుకుని, పిచ్చెత్తినదానిలా రామిని బుగ్గలమీదా, కళ్లమీదా, ముక్కుమీదా, నుదురుమీదా ముద్దు పెట్టుకుంది. రామి ఈ చేష్ట లేమీ బోధపరుచుకోలేక బేరుమని ఏడవడం మొదలుపెట్టింది. లక్ష్మాయి ఈ లోకాన్నంతా మరచిపోయినట్టూ, 'వీళ్లంతా ఎవరు' అన్నట్టూ చచ్చిపడున్న కొడుకుకేసీ, వెర్రిగా గోల పెట్టున్న మొగుడుకేసీ చూస్తూ నుంచుంది.

గ్రామం అంతా 'చంపిన దుర్మార్గుడెవడా' అని తల్లడిల్లిపోయారు. కుర్రవాడు ఎన్నడూ ఎవరినీ బాధించినవాడు కాదు. వీరన్నా, లక్ష్మాయీ కూడా గ్రామంలో ఎన్నడూ ఎవరికీ అపరాధం చేసిఎరగరు. వాళ్లిద్దరూ అంటే అందరికీ అభిమానమే. అందరికీ ప్రేమే. పోనీ, కుర్రవాడిమీద ఏమైనా నగ లున్నాయేమో నంటే, మెడలో కాని, మొలలో కాని వెండిపావలాకాసైనా లేదు. ఎవరు చంపినట్టు? ఎందుకు చంపినట్టు? ఎవరికీ బోధపడలేదు.

మునసబు గ్రామస్థులందరినీ ఇళ్లకి పొమ్మన్నాడు — రామస్వామినీ, వీరన్ననీ, లక్ష్మాయినీ తప్ప. కాసేపట్లో గుసగుసలాడుకుంటూ ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. మునసబు వీరన్నకేసీ, లక్ష్మాయికేసీ చూస్తూ "ఇంట్లో కొడుకు లేడన్నమాట ఇంతవరకూ తెలుసుకోనేలేకపోయారర్రా, వెర్రివాళ్లలారా?" అన్నాడు. రాత్రంతా వీరఘుంటలవారి కొబ్బరి తోటలో కాపలా కాస్తూఉన్నాడు వీరన్న. తెల్లవారినతర్వాత తను ఇంటికి వచ్చేసరికి నాగన్న లేడింట్లో. లక్ష్మాయిని అడిగితే కాలకృత్యాలకని ఊరి బయటకి పోయుంటాడని సమాధానం చెప్పింది. ఇంకా వస్తాడని చూస్తూఉండేసరికి ఎదుటింటి చంద్రమ్మ వచ్చి "మీ నాగన్నని ఎవరో చంపేసేరట" అని కబురు చెప్పింది. పిచ్చెత్తినవాళ్లలా ఇద్దరూ పరుగెత్తుకు వచ్చారు. నిన్నరాత్రి వీరన్న తోటకి పోయేవేళకి నాగన్న నిద్రపోతూ ఉన్నాడు. లక్ష్మాయి ఈవాళ నిద్ర లేచేక నాగన్నని చూడలేదు కాని, సగంరాత్రివేళ తను నిద్ర పోబోయేముందు కొడుకుని కళ్లారా చూసింది. చలిగా ఉం దని చెప్పి తన పాతచీర మడిచి నాగన్నకి కప్పింది కూడాను. పొద్దున్న లేచేసరికి నాగన్న లేడు. తన పాతచీర ఒకపక్కగా పడుంది. నాగన్న లేకపోవడం చూసి, మామూలువేళ కానప్పటికీ మామూలుగానే బయటికి వెళ్లేడనుకుంది. కొన్నినెలలబట్టి నాగన్న అవసరం వచ్చినప్పుడల్లా తల్లినికాని, తండ్రినికాని లేపి తోడురమ్మనకుండానే బయటికి పోతున్నాడు. కలలోనైనా అనుకోలేదు వాళ్లు బ్రతికుండగా నాగన్నని మళ్లీ చూడమని.

"మీపిల్లవాడిని ఏకక్షవల్లనైనా ఎవరైనా చంపి ఉండొచ్చునని మీకు ఎటువంటి అనుమానాలైనా ఉన్నాయా?" అని అడిగేడు మునసబు.

వీరన్న లక్ష్మాయికేసి చూసేడు.

"మామీద కక్ష లెవరి కుంటాయి బాబూ?" అంది లక్ష్మాయి.

నిజమే, వీరన్నమీద కక్షపెట్టుకునేవాళ్లెవరుంటారు? మునసబుకి ఈహత్య బోధపరచుకునే మార్గం ఏమీ తోచలేదు.

మూలపేటకి ఒకరితర్వాత ఒకరు పోలీసుద్యోగులు వచ్చారు—ఉప్పాడకనిస్టేబు మొదలు జిల్లాసూపరెంటువరకూ. గ్రామం అంతా పరీక్షచేసేరు. వీరన్న గుడిసె అంతా క్షుణ్ణంగా చూసేరు. పిల్లవాడి పూర్వచరిత్రా, తల్లిదండ్రుల పూర్వచరిత్రా అంతా కనుక్కున్నారు. గ్రామంలో పెద్దమనుష్యుల నందరినీ చేరదీసి ఈవిషయమై ప్రశ్నలు వేసేరు. గ్రామంలోనే ఒక పిచ్చివాడు తనే నాగన్నని చంపేనని అందరితోనూ చెప్తుంటే వాడిని తీసుకుపోయి రెండురోజులు ఖైదులో ఉంచి మళ్లీ వదిలేసేరు—ఉరిశిక్ష వెయ్యకుండా. చంపినవాడు నాగన్న మెడని వాడిగల కత్తితో నరికేడన్నమాట నిశ్చయం అన్నారు. చంపిన తర్వాత, చంపినమనిషి ఆకత్తిని అంటుకున్న రక్తం ఉత్తరదిక్కున వీరఘుంటలవారి తోటకి వెళ్లే

పుంతలో పడిఉన్న ఒక చింకిగుడ్డతో తుడిచి, గుడ్డని ఆ పుంతలోనే మళ్లీ పారేసి వెళ్లిపోయాడని కూడా కనిపెట్టేరు. అంత మరీ నమ్మకంగా చెప్పేందుకు వీలులేదు కాని, మునసబుగారి సరుగుడుతోటకి దక్షిణాన్ని ఉన్న మురికినీటి గుంటలో కత్తిని ఆఖరిసారి శుభ్రంగా కడుక్కున్నట్టుకూడా సూచనలు కనిపిస్తున్నా యన్నారు. సీమలోనూ, కలకత్తా బొంబాయిలలోనూ పాదాలముద్రలనుబట్టీ, చేతిముద్రలనుబట్టీ హంతకులనీ, దొంగలనీ పట్టుకుంటున్నారు కాని, పల్లెటూళ్లలో పుంతలలోనూ, గుంటల దగ్గరా లక్షలకొలది పాదాల ముద్రలు ఉండడంవల్ల ఈ సందర్భంలో వాళ్ల సహజనైపుణ్యం చూపేందుకేమీ వీలులేదని విసుక్కున్నారు. ఆరువారా లయాక చంపినవా డెవడో కనిపెట్టలేమని నిశ్చయించుకుని ఈ విషయమై ఇంక చర్చ వదులుకున్నారు.

రెండు మూడు నెలలలో మూలపేట గ్రామంలో హడావిడి తగ్గిపోయింది. గ్రామం మళ్లీ యథాప్రకారంగానే ఉంది. బట్టలనేత నడివీధిలో మామూలుగానే జరుగుతోంది. పొలాలకి పోయేవాళ్లు మామూలు వేళలకే పొలాలకి పోతున్నారు. ఎప్పటికీ జరుగుతున్నట్టే ప్రాణంలేని ఎడ్లతో భూములు దున్నుతున్నారు. సాయంత్రం కల్లుదుకాణందగ్గర ఎప్పటంత అల్లకల్లోలమూ జరుగుతూనే ఉంది. మిఠాయికోమటి బెల్లపు జీడిపప్పు కొల్లలుగా ఇంకా అమ్ముతూనే ఉన్నాడు.

నాగన్నచావుగురించి సామాన్యంగా మాట్లాడడంకూడా మానేసేరు ప్రజ. ఎవరికీ ఆ చిత్రవధ బోధపడలేదు.

వీరన్నకి తప్ప.

ఎందువల్లనంటే, నాగన్నని చంపినది వీరన్నే.

రమారమి ఏడెనిమిదేళ్లక్రిందట వేసంగి శెలవలకి కాకినాడనుంచి వీరఘంటలవారి కుటుంబం అంతా రెండు నెలలు వాళ్లతోటలో గడిపేందుకని మూలపేటకి వచ్చారు. ఉప్పాడలో నాలుగు రెండెడ్లబళ్లు కుదుర్చుకుని ఒకనాడు సాయంత్రం ఆరుగంటలకి తోట చేరుకున్నారు.

వీరఘంటల సుందరరామయ్యపంతులుగారు చాలా పేరుప్రతిష్ఠ లున్న మనిషి. ఆయనకి చిన్నతనంలోనే మొదటి భార్య పోవడంవల్ల మళ్లీ పెళ్లి చేసుకుంటే, రెండవభార్యకూడా ఇరవైఏళ్లు నిండకుండా ముగ్గురు కొడుకులినీ, ఒక కూతురునీ కని ఇరవైఒకటవ ఏట హఠాత్తుగా పోయింది. రెండవభార్య పోయినప్పుడు సుందరరామయ్యగారికి ముప్పైఅయిదేళ్లు. మళ్లీ పెళ్లి చేసుకోలేదు. సంస్కృత సాహిత్యంలో ప్రవేశం ఉండడంవల్ల వేదాలూ, ఉపనిషత్తులూ, భారత భాగవతాలూ చదువుకుంటూ కాలం వెళ్లబుచ్చేవాడు. పెద్దలు సంపాదించిన ఆస్తి ఉండడంవల్ల ఉద్యోగం చేసే అవసరం ఆయనకి లేకపోయింది.

ఈసారి ఆయన మూలపేటగ్రామానికి వచ్చినప్పుడు ఆయనముగ్గురుకొడుకులూ, ఇద్దరు పెద్దకోడళ్లూ, మనమలూ, మనమరాళ్లూ అందరూ వచ్చారు. ఆయన పెద్దకొడుకు లిద్దరికే పెళ్లయింది. మూడవకొడుకు సుబ్రహ్మణ్యానికి ఇంకా పద్ధెనిమిదేళ్లు నిండలేదు.

వీరఘంటలవారి కుటుంబంతోపాటు, సుందరరామయ్యగారి రెండవకొడుకు మామగారైన అన్నంభొట్ల వెంకయ్యగారూ, ఆయన భార్యా, ఆయన రెండవకొడుకు రామచంద్రుడుకూడా వచ్చారు. వెంకయ్యగారంటే సుందరరామయ్యగారికి చాలా అభిమానం. చిన్నతనంనించీ వాళ్లిద్దరూ స్నేహితులు. అనేకసార్లు సుందరరామయ్యగారూ, వెంకయ్యగారూ కలిసి మూలపేట వచ్చి వారం పదిరోజులు కలిసిఉండేవారు. స్నేహితులైనా వాళ్ల ఇద్దరి స్వభావాలలోనూ చాలా వ్యత్యాసం ఉంది. సుందరరామయ్యగారు కలిసిగొట్టుగా అందరితోనూ మాట్లాడేవాడు కాదు. వెంకయ్యగారు మనిషి కనపడ్డంతడవుగా కబుర్లలోకి దిగేవాడు. వెంకయ్యగారు చమత్కారంగా కబుర్లు చెప్తుంటే సుందరరామయ్యగారు నవ్వి ఆనందించడమేకాని ఆయనంతట ఆయన సరదాగా ఉండేవాడు కాదు.

సుందరరామయ్యగారు ఒక్కరూ అనేకసార్లు మూలపేట వస్తూఉండేవారు కాని, ఇదే మొదటిసారి ఇంత పరివారంతో ఈ గ్రామం రావడం. ఆ పాటి

ఈ పాటి మక్తాలు వచ్చే భూములు ఆయనకి కోన సీమలో ఉన్నప్పటికీ, ఆ ప్రాంతాలకి అంత తరచు వెళ్లకపోయినా, కాపు లేని కొబ్బరితోటకోసమూ, ఎన్నేళ్లు పెరిగినా ఎప్పుడు కొట్టుకు అమ్మకో డమో తెలియని సరుగుడుతోటకోసమూ, పూతైనా చూసి ఆనందించడానికి తగని నాలుగైదువందల మామిడిమొక్కలకోసమూ రెండేసి నెలల కొకసారి మూలపేట వచ్చి, ప్రతిసారీ అథమం వారంరోజులైనా ఉండకుండా వెళ్లేవాడు కాదు సుందరరామయ్య గారు. సుమారు ఇరవై ఏళ్లు గడిపేడీలాగ. కొబ్బరి తోటలో ఆశవదులుకోవలసివచ్చే వేళకి సరుగుడువల్ల లక్షాధికారి నైపోవాలనుకుంటూ ఉండేవాడు. సరుగుడు సమంగా పెరగక, ఆ పెరగనిస్థితిలోనే కొట్టి నష్ట పోయేవేళకి మామిడితోటవల్ల సంచీలు వచ్చి చేతిలో పడతాయి అంటూ ఉండేవాడు. కొబ్బరికి పెంట చాల దనేవాడు, కొత్తసరుగుడుతోట క్రిందకేడే రెమ్మలు కొట్టిస్తే దివ్యంగా ఉండుననేవాడు, మామిడి లో జాతితప్పు కాని నేలతప్పు కాదనేవాడు. ఎలా అయితేనేమి-సరదా తీరేందుకు సముద్రపువార కనుక ఆ గ్రామానికి వెళ్తున్నట్టు అయేదికాని డబ్బుచేసే రీత్యా అయేదికాదు.

సుందరరామయ్యగారి తోటలన్నీ చూసుకోడం మొదట్లో వీరన్నతండ్రి ముసలయ్య. ముసలయ్య పోయాక ముసలయ్యపెత్తల్లికొడు కొకడు చూసి పెట్టేవాడు. ముసలయ్య మొదటినుంచీ అసలు జబ్బు మనిషి. కాని అతనిభార్య సుబ్బి చిన్నతనంనుంచీ చాలా చాకచక్యంగల మనిషి. మొగుడుహయాము లోనూ, మరిదిహయాములోనూ, తర్వాత కొడుకు వీరన్నహయాములోనూ కూడా వ్యవసాయపుపనులు ఇతరులుచేసినా ముఖ్యపెత్తనం అంతా డబ్బువిషయం లో తనే నిర్వహించుకుంటూవచ్చేది. కొడుకు పెళ్లి చేసుకునేవరకూ బ్రతికింది. మనమడు పుట్టకుండానే పోయింది.

ఈసారి సుందరరామయ్యగారు అందరినీ వెంట పెట్టుకుని మూలపేటకి వచ్చినప్పుడు వీరన్నకి ఇరవై ఇరవై ఒక్క సంవత్సరాలవయస్సు. అప్పటికి ఏడాది పైని కొన్నినెలలయింది లక్ష్మాయిని పెళ్లిచేసుకుని. అప్పటికప్పుడే లక్ష్మాయిమేనమామకొడుక్కి పళ్లు విరగడం కూడా జరిగింది.

వీరఘుంటలవారితోట గ్రామానికి రమారమి మైలున్నరదూరంలో ఉంది. అందులో మధ్యని ఒక బంగళా. బంగళాకి ఒకవైపున అందరూ పడు కునేందుకు ఒక పందిరి. మరొకవైపున వంటలకీ, భోజనాలకీ ఏర్పాటు. ఈసారి వీరందరూ వచ్చినప్పుడు, వీరన్న ఉప్పాడవరకూ వెళ్లి, బళ్లు కుదిర్చి వీరందరినీ తోటబంగళాదగ్గరకి చేర్చేడు. తోటలో లక్ష్మాయి, వేడినీళ్లు పోసుకునేవాళ్లకి వేడి నీళ్లు కాచిపెట్టీ, కాకినాడనుంచి కూరలూగట్రా తెచ్చుకుంటారో లేదో అని కూరలు తెచ్చి ఉంచీ, పొయ్యిలు అలికిపెట్టి శుభ్రంగా ఉంచీ, కర్రలు జాగ్రత్తపెట్టీ, అన్నిసౌకర్యాలూ తయారుగా ఉంచిం ది. సుందరరామయ్యగారిని చూడగానే ఇంతముఖం చేసుకుని, 'బాబుగారూ' అంటూ ఆయనపాదాలకి నమస్కారం చేసింది.

"మహాచక్కని పిల్లని పెళ్లిచేసుకున్నావోయి, వీరన్నా. మా ఆవిడకూడా చిన్నప్పుడు ఇంత అందం గానూ ఉండేది" అన్నాడు వెంకయ్యగారు.

నవ్వుతూ, "ఆ బాబుగారికికూడా నమస్కారం చెయ్యిమరి" అన్నాడు వీరన్న.

ఆడవాళ్లస్నానాలన్నీ అయి, వంటప్రారంభం అయాక, "ఇక వెళ్లు లక్ష్మాయీ, బాగా చీకటిపడింది కూడాను. ఇంకా వంటచేసుకోవాలికాబోలు నువ్వు" అన్నాడు సుందరరామయ్యగారు.

"మావంటల కేం లెద్దుకూ, బాబూ...పోవే, పో. తర్వాతొస్తాలే నేను" అన్నాడు వీరన్న.

పక్కకి పిలిచి నెమ్మదిగా "ఎంతసేపట్లో?" అని అడిగింది లక్ష్మాయి.

"గంటయాక రావచ్చు, తెల్లారేక రావచ్చు. చెప్తేకాని వీల్లేదా?... పో, నీపనులు చూసుకో" అని కసిరేసేడు వీరన్న.

ఈసంభాషణ జరిగిన పది పదిహేను నిముషాలలో లక్ష్మాయి మళ్లీ తోటబంగళాదగ్గరకి ఊపిరాడకుండా హడావిడిగా వస్తే, అందరూ ఇదేమిటని అడిగేరు. జవాబుచెప్పక ఏడుస్తూ కూర్చుంది లక్ష్మాయి. వీరన్న కఠినంగా ఏవో రెండుముక్కలంటే, సుందరరామయ్యగారికేసి చూస్తూ, ఆఖరికి, "నాకు భయమేసింది బాబూ! ఇద్దరం కలిసే పోతాం" అని మాత్రం సమాధానం చెప్పింది. ఇటూ ఆటూ ఏవైపునుంచి ఎవరు వస్తారో అన్నట్టు ధ్వనులు వింటున్న లేడిలా బెదిరిపోతూ నాలుగుదిక్కులూ పరీక్షచేస్తూ కూర్చుంది. "వెర్రిగోల బాబూ!" అని విసుక్కున్నాడు వీరన్న. గంటో ఎంతో అయాక, వీరన్న పక్కలన్నీ వేసేక, ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు.

భోజనంవేళకి చూస్తే సుందరరామయ్యగారి మూడో అబ్బాయి సుబ్రహ్మణ్యమూ, వెంకయ్యగారి కొడుకు రామచంద్రుడూ ఇద్దరూ లేరు.

"సముద్రపువారకి పోయారేమో?" అన్నాడు సుందరరామయ్యగారి పెద్దకొడుకు సర్వేశ్వరరావు.

వాళ్లు ఎంతసేపటికీ రాకపోతే, ఆఖరికి మిగిలిన వాళ్లు భోజనాలకి కూర్చున్నాక, మజ్జిగలు కలుపుకుంటుంటే తయారయారు వాళ్లిద్దరూ. వస్తూ సైనా తిన్నగా భోజనాలకి రాకుండా ఇటూ అటూ పచార్లు చేస్తుంటే "ఇప్పటికైనా దయచెయ్యండి. మీకోసం కనిపెట్టుకుని ఆడవాళ్లు ఏడుస్తూ కూర్చోవలసిందేనా? ఎక్కడికి పోయారు?" అని అడిగేడు వెంకయ్యగారు.

"అలా సముద్రపువారకి వెళ్లి, అలాఅలా తిరిగి తిరిగి, మళ్లా బంగళాదగ్గరకి వద్దా మనుకునేసరికి తోవ తప్పిపోయాం" అన్నాడు రామచంద్రుడు నసుగుతూ నసుగుతూ.

"తోవ ఎలా తెలియకుండా ఉంటుందర్రా, చీకట్లో ఈపెట్రొమాక్సుదీపం మైళ్లకిమైళ్లు కనిపిస్తూ ఉంటుందికదా?" అని అసీగేడు సుందరరామయ్యగారు.

మొన్నాడు రుద్రుడిలా వచ్చాడు వీరన్న, ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే.

సుందరరామయ్యగారిని 'బాబూ' అని పక్కకి పిలిచి, క్రిందటి సాయంత్రం లక్ష్మాయి ఇంటికి పోతుంటే అబ్బాయిగోరు చటుక్కున వచ్చి, లక్ష్మీనారాయణగారితోటదగ్గర లక్ష్మాయిచెయ్యి పట్టుకుని చొరవ చేయబోతే లక్ష్మాయి తప్పించుకుని మళ్లీ బంగళాదగ్గరకి పరుగెత్తుకు వచ్చిందని చెప్పేడు.

సుందరరామయ్యగారు "అదేమిటోయి వీరన్నా, ఏ అబ్బాయోయి?" అని ఇంకా ఏదో అనబోతుంటే, "మీఅంత డబ్బుగలవాళ్లం కాకున్నా మేమూ మానం, మర్యాదా ఉన్నవాళ్లమే బాబూ. ఇదే మీవారు కాకుండా మరొకరై యున్నట్టయితే- కూనీలు జరగవలసినంతపని. మా తల్లినాటినుంచీ, తండ్రినాటినుంచీ మీకాళ్లనంటి బతుకుతున్నవాళ్లం కనుక వచ్చి మీతో చెప్పుకుంటున్నాను" అన్నాడు వీరన్న.

అప్పుడు ప్రారంభమయింది చర్చ: లక్ష్మాయిని చొరవచెయ్యబోయినది ఎవరూ అని. సుందరరామయ్యగారి మూడవకొడుకు సుబ్రహ్మణ్యమో, వెంకయ్యగారికొడుకు రామచంద్రుడో అయుండాలని తేలింది.

వెంకయ్యగారు "మావాడే అయుంటాడు, దొంగవెధవ. రెండువారాలక్రిందట, కాకినాడలో పక్కింటి వెంకట్రామయ్యగారు వీడు గోడలు ఎక్కడమూ, తొంగిచూడడమూ మరీఅన్యాయంగా ఉన్నాయనీ, ఆయనకూతుళ్లని వీడు అవమానపరుస్తున్నాడనీ గోలపెట్టేడు, పాపం బ్రాహ్మడు. పోనీ, వెధవకి పెళ్లి చేసేద్దామంటే పదహారేళ్లు నిన్నో మొన్నో నిండేయి" అన్నాడు.

ఇంతట్లో రామచంద్రుడు ఈ అట్టహాసం చూడ్డానికి వచ్చాడు.

"ఏమిరా వెధవా, నువ్వేనా ఈ వెధవపని చేస్త?" అని అడిగేడు వెంకయ్యగారు.

"ఏ వెధవపని నాన్నా?" అన్నాడు రామచంద్రుడు నదురూ బెదురూ లేకుండా.

"ఇంతసేపూ వినడంలేదురా? దొంగవేషాలూ నువ్వూను."

"లేదు, నాన్నా!"

అప్పుడు బోధపరిస్తే, "నిన్న మనం రాగానే సుబ్రహ్మణ్యమూ, నేనూ సముద్రపువారకి వెళ్లిపోయాం. బంగళాకి వచ్చేవరకూ ఇద్దరం కలిసేఉన్నాం. ఇంకా కావలిస్తే వాడిని అడుగు" అన్నాడు రామచంద్రుడు.

సుబ్రహ్మణ్యం కూడా వచ్చాడు. "ఏరా, నువ్వూ నేనూ కలిసే వెళ్లేంకాదురా సముద్రపువారకి? అంతసేపూ కలిసే ఉన్నాంకాదూ?"

"ఏమీ, ఆ చర్చ ఎందుకు వచ్చిందిప్పుడు?"

సుబ్రహ్మణ్యానికికూడా బోధపరిచారు.

"మాకేం తెలియదు. బుద్ధిపొరపాటున సముద్రపువారకి వెళ్లి తోవ తప్పి ఏడుస్తూ అర్ధరాత్రి ఇంటికి చేరుకుంటే మా కిదొకటికూడానా? నా కేం తెలియదు." అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుబ్రహ్మణ్యం మాట్లాడుతున్నంతసేపూ సుందరరామయ్యగారు అతన్నే పరీక్షగా చూస్తూ నుంచున్నాడు. కొడుకుమాట నమ్మలేదు.

"నీ పెళ్లాం సరిగ్గా పోలికపట్టలేదటోయి?" అని అడిగే డాయన వీరన్నని.

"శుద్ధమొద్దావతారం, బాబూ! నిన్నరాత్రంతా అడిగితే పెద్దబ్బాయిగారేమో అంటుంది. పెద్దబ్బాయిగారు ఆరకంకాదని నాకు తెలుసు బాబూ" అన్నాడు వీరన్న.

"పెద్దవాడు నిన్నసాయింత్రం ఇక్కడనుంచి కదలందే" అన్నాడు సుందరరామయ్యగారు. "నీ పెళ్లాం మళ్లీ వచ్చినప్పుడు వాడు మాతో ఇక్కడే కూర్చున్నాడుగా?"

"ఎవరిని చూసి మా అబ్బాయిలలో ఒకరనుకుందోనోయి మీఆవిడ" అన్నాడు వెంకయ్యగారు.

నాలుగైదురోజులు వీరన్న లక్ష్మాయిని పీడించుకుతిన్నాడు, "పోలిక చెప్పలేవటే?" అంటూ.

ఆఖరికి సుందరరామయ్యగారి మూడవ అబ్బాయేనని అనుమానం గట్టిగా మనస్సులో ఉంచుకుని, నాలుగైదురోజులు లక్ష్మాయిని బంగళాకి రావద్దని కూడా హుకుం ఇచ్చాడు. నాలుగైదురోజు లయాక కొంత పట్టుదల తగ్గింది. అనుమానంకూడా తగ్గింది. యథాప్రకారంగా లక్ష్మాయి తోటలోకి వస్తూఉండడమూ, చిన్నచిన్న పనులు చేసిపెట్టూఉండడమూ జరుగుతూ వచ్చింది. మొగవాళ్లుంటే వాళ్లున్నవైపు వెళ్లడానికి వీలులేదనిమాత్రం వీరన్న లక్ష్మాయినికట్టుదిట్టంచేశాడు.

నాలుగైదువారాలు అన్నీ సవ్యంగానే నడిచాయి.

ఈ నాలుగైదువారాలలోనూ ఒకనాటి విశేషాలు వీరన్నమనసులో బాగా నాటుకుపోయాయి.

వెంకయ్యగారు సాముద్రిక శాస్త్రం గురించి ఆయనచుట్టం ఎవరో పుస్తకంవ్రాస్తే, ఆపుస్తకం చదువుతూ, రోజూ మధ్యాహ్నం నిద్రలేచి, కాఫీలో కొబ్బరినీళ్లో అందరూ తాగడం అయాక, సావకాశంగా అందరినీ చుట్టూ చేరదీసి అందరిజాతకాలూ చెప్తూవచ్చేవా డాయన. ఒకనాడు ఆయన ఈవిధంగా కాలక్షేపం చేస్తుంటే వీరన్నకూడా పక్కని కూర్చుని ఆనందిస్తున్నాడు.

వెంకయ్యగారు సుందరరామయ్యగారి రెండో అబ్బాయి వెంకటాద్రిచెయ్యి పరీక్ష చేస్తున్నాడు.

"ఏమిటి అంతదీక్షగా పరీక్ష చేస్తున్నారు, మామగారూ?" అన్నాడు వెంకటాద్రి.

"నీ చిటికినవేలోయి" అన్నాడు వెంకయ్యగారు.

"చిటికినవేలున కూడా సాముద్రికంలో అవసరమైన రేఖ లున్నాయా?" అని అడిగేడు వెంకటాద్రి.

"రేఖలకోసంకాదు...ఆరేఖలుకూడా చూడాలి...అది కాదు. ఈ వంకరచిటికినవేలు రెండుచేతులకీ కూడా ఉన్నట్టేనా?" అని అడిగే డాయన.

"రెండు చేతులకీను. మా అందరికీ అంతే."

రెండు వంకరచిటికినవేళ్లూ పరీక్షగా చూసేడు వెంకయ్యగారు.

సుందరరామయ్యగారి పెద్దఅబ్బాయీ, మూడో అబ్బాయీకూడా దగ్గరగా జేరి, వాళ్లకికూడా రెండు చేతులకీ వంకరచిటికినవేళ్లేనని చూపించారు.

"వీరఘంటలవారి కందరికీ వంకర చిటికినవేళ్ళే నన్నమాట" అన్నాడు వెంకయ్యగారు.

"మా ఇద్దరబ్బాయిలకీ, అమ్మాయికీకూడా వంకర చిటికినవేళ్ళేనండీ" అంది సుందరరామయ్యగారి పెద్దకోడలు. "మా రెండో అబ్బాయికి మరీ చక్కగా విల్లువంచిన ట్లుంటా యావేళ్లు."

"నీ పిల్లల్ని ఇలా తీసుకురా" అన్నాడు వెంకయ్యగారు.

చిటికిన వేళ్లకి చక్కని వంకర ఆ పిల్లలందరికీ.

ఇంతట్లో సుందరరామయ్యగారుకూడా వచ్చాడు.

"వియ్యంకుడిగారికి కూడా వంకర చిటికిన వేళ్లేనా?" అని అడిగేడు వెంకయ్యగారు.

"మా కుటుంబంలో అందరికీ వంకర చిటికిన వేళ్ళేనండీ" అన్నాడు సుందరరామయ్యగారు, తన చిటికినవేళ్లు చూపిస్తూ. "మా పిల్లలందరికీ చూడండి. మా పెద్దబ్బాయికొడుకులకి కూతురుకీ, మా రెండో వాడి కూతురికి కూడాను. కాని దాని కంత స్పష్టంగా లేదు. లేకపో లేదులెండి. నాకూతురికిమాత్రం- సుందరికి ఆ వంకర లేదు. మళ్లీ సుందరికొడుక్కి వంకర చిటికినవేళ్లు తయారయాయి."

"మా మనమరాలికి వంకరవేళ్లన్న సంగతి ఈ రోజువరకూ నాకు తెలియనే తెలియదు, బావ గారూ!" అన్నాడు వెంకయ్యగారు. అని, "వీర ఘంటలవారి రక్తసంబంధం ఉంటే చాలు నన్నమాట వంకర చిటికినవేళ్లు ప్రత్యక్షం అవడానికి" అన్నాడాయన.

ఈ హడావిడిలో అందరూ ఎవరి చిటికినవేళ్లు వాళ్లు పరీక్ష చేసుకుంటుంటే, వీరన్నకూడా తనవేళ్లు చూసుకుంటున్నాడు.

"నీకు కూడా వంకర చిటికిన వేళ్లున్నాయేమోనని చూసుకుంటున్నావా ఏమిటోయి, వీరన్నా?" అన్నాడు సుందరరామయ్యగారు.

"లేదు, బాబూ! అందరూ చూస్తుంటే నేనూ చూస్తున్నాను" అన్నాడు వీరన్న.

"వీరన్న చెయ్యిచూసి అతని జాతకంకూడా చెప్పాలి ఈ గ్రంథపఠనం పూర్తయాక" అన్నాడు వెంకయ్యగారు.

"చిత్తం, బాబూ" అన్నాడు వీరన్న.

ఇది జరిగిన పది పదిహేను రోజుల లోపుగానే వీరన్నకి పూర్తిగా మనసు చెదిరిపోయే పరిస్థితులు ఈవిధంగా ఏర్పడ్డాయి:

తోటలో బంగళాకి నాలుగైదు వందల గజాల దూరంలో వీరన్న ఒక తాటాకులకొంప కట్టుకున్నాడు. ప్రొద్దున్నే ఇంట్లో చల్ద(ద్ది?)న్నం తిని వచ్చేసేవాడు. మధ్యాహ్నం సుమారు ఒంటిగంటవరకూ తోటల లోనూ, పొలాలలోనూ పనులన్నీ చూసుకుని ఈగుడిసె చేరుకునేవాడు. సుమారు ఆవేళకే లక్ష్మాయి వీరన్నకి తిండి తెచ్చి పెట్టేది. ఒకరోజున వీరన్న ముందు వచ్చేవాడు; ఒకరోజున లక్ష్మాయి ముందు వచ్చేది. వీరన్న ముందుగా వచ్చినట్టయితే లక్ష్మాయివచ్చేవరకూ ఒక మూల పడుకునేవాడు— అయిదునిముషాలైనా, పది నిముషాలైనాకూడా. లక్ష్మాయి ముందు వచ్చినట్టయితే పయిన నుంచుని వీరన్నకోసం కాచుకుని ఉండేది.

ఈ రోజున వీరన్న అంత మరీ తొందరగా రాలేదుకాని, లక్ష్మాయి గుడిసెబయట కాచుకునిలేదు. వీరన్న వచ్చే మార్గాన్ని ఎంతో దూరానికి కనిపిస్తుంది గుడిసె. ఇంకా లక్ష్మాయి రాలేదు కాబోలనుకున్నాడు. ఇంతలో మళ్లీలక్ష్మాయిగుడిసెలోంచేబయటికివచ్చింది— వీరన్న వస్తున్న వైపుకాకుండా మరొకవైపు పరీక్షగా చూస్తూ. లక్ష్మాయి బయటికి వచ్చిందో లేదో లక్ష్మాయి వెంట సుందరరామయ్యగారి మూడవఅబ్బాయి సుబ్రహ్మణ్యంకూడా బయటికి వచ్చాడు. లక్ష్మాయి వీరన్నని చూడలేదు. సుబ్రహ్మణ్యంకూడా చూడలేదు. ఇంతలో సుబ్రహ్మణ్యం లక్ష్మాయిబుజంమీద ఒక చెయ్యివేసి మరొకచేతితో నడుము పట్టుకోబోతున్నాడు. లక్ష్మాయి వెనక్కి తిరిగి చూసింది. వెనక్కి తిరిగి చూడడంలో వీరన్న కనబడ్డాడు. కెవ్వున కేకవేసింది. సుబ్రహ్మణ్యంకూడా వెనక్కి తిరిగి చూసేడు. వీరన్నని చూడగానే ఒక్కటే పరుగు పరుగెత్తేడు తోట బంగళావైపు. వీరన్న అతని వెంట పరుగెత్తలేదు.

లక్ష్మాయి ఏడుస్తూ నుంచుంటే ఎడాపెడా ఎడాపెడా నూరుగుద్దులు గుద్దినట్టు బాదేసేడు. "వద్దోయి, వద్దోయి, నన్నెందుకు చంపుతావోయి, నే నేపాపమూ ఎరగ నోయి" అంటూ ముద్దయి కూలిపోయింది. "రంకు ముండా, లంజా" అంటూ, ఎక్కడలేని ఉద్రేకంతోనూ తొక్కి తంతున్నాడు వీరన్న లక్ష్మాయిని. లక్ష్మాయినోటంట రక్తం కారుతోంది. పెద్దపెట్టున కేకలు వేస్తోంది.

కేకలు విని సుందరరామయ్యగారూ, ఆయన పెద్దకొడుకూ పరుగెత్తుకుంటూ వచ్చారు.

"అదేమిటోయి వీరన్నా, సిగ్గు లేదూ ఆడదాన్ని అలా కొట్టడానికి?"

"మీరు మాట్లాడకండి, బాబూ. దగ్గర కొచ్చారంటే ... మరక్కడే ఉండండి, బాబూ ... రంకుముండ ..."

"దైవసాక్షిగా నే నేమీ ఎరగను, బాబూ. ఆ అబ్బాయి ఇక్కడున్నట్టే నాకు తెలియదు" అంటూ మొర పెట్టోంది లక్ష్మాయి, నోటినున్న రక్తం కొంగుతో తుడుచుకుంటూ.

"నోరు ముయ్యి, లంజా"

"కొట్టకోయి, వీరన్నా...కొట్టేవంటే నిన్ను చంపేస్తాను" అన్నాడు సుందరరామయ్యగారు.

"ఎవరు లక్ష్మాయీ, ఎవరా అబ్బాయి? మామాడ్డోవాడేనా?" అని అడిగే డాయన.

"నన్ను రక్షించాలి, బాబూ. నే నేమీ ఎరగను. ఏ పాపం చేసినదాన్ని కాను. ఆ అబ్బాయి గుడిసెలో దాంకున్నాడుకాబోలు. నాకు తెలియదు. కుండ కిందపెట్టుంటే నే ఎక్కడో చప్పుడైతే, బయట కొచ్చాను—ఆ అబ్బాయి మీద చెయ్యివేసేడు..."

"ఛీ, రంకుముండా"

"అదుగో, వీరన్నా"

"లేదు బాబూ. లోపల ఇద్దరూ సరసాలాడుకుంటున్నారుబాబూ. సరసాలాడుకుంటూ పైకొచ్చారు బాబూ!"

లక్ష్మాయి 'కాదుకా'దని ఏడ్చింది. బంగళాలో ఉన్నవాళ్లందరూ చుట్టూచేరుకున్నారు, సుబ్రహ్మణ్యం తప్ప.

"ఏమిటి నాన్నా, ఇదంతా" అని అడుగుతున్నాడు రామచంద్రుడు వెంకయ్యగారిని.

సుందరరామయ్యగారి పెద్దకోడలు గుడిసెలోనుంచి కుండలో నీళ్లు తెచ్చి లక్ష్మాయికి తాగడానికి ఇచ్చింది.

"నీళ్లతో ముఖంకూడా కడుక్కో పాపం" అందావిడ.

ఇంతట్లో సుందరరామయ్యగారు "వాడేడీ వెధవ? సుబ్రహ్మణ్యం ఏడీ?" అన్నాడు.

"బంగళాలో లోపల తలుపువేసుకుని పడుకున్నారు మూలగదిలో" అంది వెంకటాద్రిభార్య.

"లాక్కురండి, ఇలాగ"

సుందరరామయ్యగారి పెద్దబ్బాయి వెళ్లేడు. అతను బయలుదేరినకాసేపటికి వీరన్నకూడా బంగళావైపు వెళ్లబోతే, "అయ్యో, మరిదిగారిని ఏంచేస్తాడో వీరన్న" అంది సుందరరామయ్యగారి పెద్దకోడలు. రామచంద్రుడుకూడా పరుగెత్తేడు వీరన్న వెంట.

"ఆగు, వీరన్నా" అని కేకేసేడు సుందరరామయ్యగారు.

వీరన్న ఆగేడు. వెనక్కి తిరిగి వచ్చాడు.

"ఈ రంకుముండ నా కొద్దు, బాబూ. దీని ముఖం చూడ నింక" అన్నాడు వీరన్న నెమ్మదిగా.

లక్ష్మాయి వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

"తొందర పడొద్దు, వీరన్నా! ఏం జరిగిందో చెప్పు" అన్నాడు సుందరరామయ్యగారు.

"చెప్పేనుగా బాబూ, ఇంకేం చెప్పాలి? ...అబ్బాయీ, ఈముండా కలిసి గుడిసెలోంచి బయటి కొచ్చారు, బాబూ. గుడిసెలో కలిసి ఎంతసే పున్నారో మరి."

"లేదు, బాబూ" అని లక్ష్మాయి ఏదో చెప్పబోతుంటే, "ఛీ, నోరు ముయ్యి" అంటూ వీరన్న

లక్ష్మాయిని కొట్టేడు. చూస్తుంటేనే బుగ్గ వాచిపోయింది లక్ష్మాయికి.

సుబ్రహ్మణ్యాన్ని లాక్కొచ్చారు వెళ్లి వాళ్లిద్దరూను.

"దొంగవెధవా, నువ్విక్కడ చేసే పని ఇదా? దొంగవెధవా, నిన్ను తీసుకురావడం పొరపాటయింది!"

"నే నేమీ చెయ్యందే?"

వీరన్న ఏమీ జోక్యం లేనట్టుగా పక్కకి తప్పుకున్నాడు.

"నిజం చెప్పు, వెధవా"

"నిజంగానే, నాకేమీ తెలియదు."

సుందరరామయ్యగారు ఏ మూలనుంచి లాగేడో తెలియదు, గట్టమైన కర్ర ఒకటి లాక్కుని సుబ్రహ్మణ్యాన్ని నడ్డి విరిగేటట్టు కొట్టేడు.

"నన్ను కొట్టకు. నాన్నా, కొట్టకు. నిజం చెప్తా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

మళ్లీ కొట్టబోతుంటే వెంకయ్యగారూ, కోడళ్లూ ఆపేరు.

"చూడండి, మరి వెధవని, ఎటువంటి వెధవ పనులు చేసి కుటుంబానికి అమర్యాద తెస్తున్నాడో... ఏం చేసేవో చెప్పు, వెధవా."

అప్పుడు చెప్పేడు సుబ్రహ్మణ్యం, మాటలకి తడబడుతూ, సందేహిస్తూ సందేహిస్తూ.

లక్ష్మాయి మధ్యాహ్నం ఈ వేళకి వస్తుందన్న విషయం తెలుసుకుని, అనేకసార్లు అనుకుని, ఈ రోజున గుడిసెలో పాతమంచం వెనకాల చీకట్లో ఒక మూల తను దాంకుని ఉన్నట్టూ, లక్ష్మాయికి ఈ సంగతి ఏమీ తెలియనట్టూ, లక్ష్మాయితప్పు ఏమీ లేనట్టూ, చొరవ చెయ్యబోయేసరికి వీరన్న కనపడినట్టూ, తను బంగళాకి పారిపోయినట్టూ ఒప్పుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"నీ పని చెప్తానుండు" అన్నాడు సుందరరామయ్యగారు.

వీరన్నవైపూ, లక్ష్మాయివైపూ తిరిగి, "వీరన్నా, విన్నావుగా? లక్ష్మాయితప్పు ఏమీ లేదు. ఇంటికి తీసుకుపో. చావబాదేసేవు, పాపం, లక్ష్మాయిని. ...ఈ వెధవమూలాన్న"

"ఇంటికి పద" అన్నాడు వీరన్న లక్ష్మాయితో. "ఎందుకు చూస్తావు? తర్వాత్తోస్తా. నువ్వు పద."

"తిండి తిన్నాక కుండ పట్టుకుపోతా" అంది లక్ష్మాయి.

* * *

రెండురోజులతర్వాత సుందరరామయ్యగారూ వారికుటుంబమూ, వెంకయ్యగారూ కొడుకూ భార్యా అందరూ మూలపేటగ్రామం వదిలి వెళ్లిపోయారు.

వెళ్లిపోబోయే ముందు సుందరరామయ్యగారు లక్ష్మాయి కొక కొత్త నూలుచీర బహుమతిగా ఇప్పించి, వీరన్నతో "లక్ష్మాయి చాలా మంచిపిల్లోయి వీరన్నా. అనవసరంగా అనుమానాలు పెట్టుకోకు" అనికూడా చెప్పేడు.

వీరన్నకిమాత్రం లక్ష్మాయిమీద అనుమానం పూర్తిగా పోలేదు. ఆరోజున తను కనబడేవరకూ ఎందుకు కేకవెయ్యలేదనీ, తను కనబడేవరకూ ఊరుకున్నట్టయితే అంతవరకూ ఏమిజరిగినట్టనీ, ప్రతిరోజూ అబ్బాయినిలా కలుసుకుంటున్నట్టే కాదా అనీ అనేకసార్లు లక్ష్మాయిని హడావిడిచేస్తూవచ్చాడు. లక్ష్మాయి మాత్రం ఇంక ఏడుపులుమాని, పొమ్మంటే పుట్టింటికి పోతాననీ, ఆఅబ్బాయి చెప్పినదంతా విన్నాకకూడా అంత అపనమ్మకం పెట్టుకునేటట్టయితే తను వేరే ముష్టయినా ఎత్తుకుంటూ బతుకుతాను కాని వీరన్నతో కాపురం అబద్ధమనీ గట్టిగా చెప్పేసింది. లక్ష్మాయి అంటే కొన్నికొన్ని సమయాలలో వీరన్నకి మళ్లీ పూర్తినమ్మకమూ, అపరిమితమైన ప్రేమాను. అపనమ్మకం హెచ్చినప్పుడల్లా కల్లుదుఖాణానికి వెళ్లి కాస్త తాగేసివచ్చి అల్లరిచేసి పడుకునేవాడు. కొన్నాళ్లకి తన అనుమానాన్ని గురించి లక్ష్మాయితో మాట్లాడడం కూడా మానేసేడు.

ఇంతట్లోనే లక్ష్మాయి కడుపుతో ఉందని తేలింది. ఒక్కసారిగా మళ్లీ అనుమానంలో పడ్డాడు వీరన్న.

"పుట్టబోయేది పిల్లో పిల్లాడో... నాకుమాత్రం కాదు. నాకు తెలుసును."

"కాకపోతే నన్ను పుట్టింటికి పోనిస్తే నా బాధేదో నేను పడతాను" అంది లక్ష్మయి.

మళ్లీ అది నచ్చలేదు వీరన్నకి.

ఒకవైపు నమ్మకమూ, ఒకవైపు అపనమ్మకమూ. నిజానికి, లక్ష్మయి గట్టిదనీ, మర్యాదైనదనీ లోలోపల ధైర్యం ఉన్నప్పటికీ సరిగా ఇప్పుడే లక్ష్మయి కడుపుతో ఉండకపోతే బాగుండునని అనుకుంటూ ఉండేవాడు.

అప్పుడప్పుడు తాగి ఇంటికి వచ్చి గందరగోళం చేసేవాడు. అదైనా అంత ఎక్కువగానూ, ఇతరులు వినేటట్లూ కాదు. ఎన్నడూ అంత అల్లరి చెయ్యలేదు. అనేకసార్లు మళ్లీ లక్ష్మయితో అతి స్నేహంగా మాట్లాడుతూ పుట్టబోయే వస్తువుగురించి ఆప్యాయంగా ప్రశ్నలు వేస్తూఉండేవాడు, కబుర్లు చెప్పేవాడు.

గడవవలసిన నెలలన్నీ గడిచేయి. కొడుకు పుట్టేడు.

కొడుక్కి రెండు చేతులకీ వంకర చిటికినవేళ్లు!

వీరఘంటలవారి వంకర చిటికినవేళ్లు!!

చక్కని శరీరచ్ఛాయ!!!

వీరన్నకి అనుమానం బాగా కుదిరిపోయింది— ఈ పిల్లాడు తన కొడుకు కాదనీ, సుందర రామయ్యగారి మూడవ కొడుక్కి పుట్టేడనీ.

పిల్లాడు పుట్టిన రోజునుంచీ లక్ష్మయిని మళ్లీ ఒకటే బాధపెట్టడం మొదలుపెట్టేడు. వంకరచిటికిన వేళ్లు చూపించి, ఆరోజున వెంకయ్యగారు చేతులు చూసి చెప్పిన సంగతంతా చెప్తూ ఈ పిల్లాడు వీరఘంటలవారికే పుట్టేడనీ, తను మధ్య మళ్లీ లక్ష్మయిని నమ్మడం పొరపాటయిందనీ గోలపెట్టడం మొదలెట్టేడు.

మొదటిసారి వింటూ, లక్ష్మయి, "మా దార్లపూడిలో సోమరాజు కూతురికి కూడా వంకర చిటికిన వేళ్లే. అదికూడా వీరఘంటలవారికే పుట్టింది కాబోలు. సోమరాజుకి పుట్టుండదు. సోమరాజుతో చెప్పాలి!" అని వేళాకోళంగా మాట్లాడింది.

వీరన్నకి అనుమానం వదలలేదు.

"నన్నూ, పిల్లాడినీ చంపేస్తే సరి. నాకీవంకర చిటికినవేళ్ల సంగతీ, ఈ విచిత్రాలూ ఏమీ తెలియవు. పిల్లాడ్ని తీసుకుని ఈ రోజునే పుట్టింటికి పొమ్మంటే పోతాను" అంటూవచ్చింది లక్ష్మయి.

లక్ష్మయి పుట్టిల్లుపేరెత్తగానే వీరన్న అనుమానాన్ని చంపుకుంటూఉండేవాడు.

పుట్టినపిల్లాడు ఎదురుగుండా ఆ వంకర వేళ్లతో అనుమానాలు కెలకకుండా ఉంటే లక్ష్మయి మంచిదే.

ఇంతట్లో పుట్టిన నెలరోజులకే పిల్లాడికి చచ్చేటంత జబ్బుచేసింది. పదిరోజు లలా జబ్బు హెచ్చయి, లక్ష్మయి ఏడుస్తుంటే, లక్ష్మయినీ పిల్లాడినీ ఉప్పాడ తీసుకుపోయి, అక్కడనుంచి పిఠాపురం తీసుకుపోయి, పెద్దవైద్యుడిచేత మందు లిప్పించి పిల్లాడిని బతికించి ఇంటికి తెచ్చుకున్నాడు వీరన్న.

తర్వాత తర్వాత "అప్పుడైనా చచ్చిపోయాడు కాదు" అనుకుంటూఉండేవాడు.

ఆఖరాఖరికి లక్ష్మయిని తన అనుమానాలతో విసుగుపెట్టడం కూడా మానేసేడు. లోపలమాత్రం అనుమానం చావలేదు.

ఈ అనుమానం హెచ్చయి బాధపడుతున్నప్పుడు తాగేసేవాడు వీరన్న. వచ్చి ఇంట్లో పడుకునేవాడు. లక్ష్మయి అంటే ఒకవిధమైన భయభక్తులు ఏర్పడ్డాయి. లక్ష్మయిని ఏమీ అనేవాడు కాదు. లక్ష్మయి ఏమంటుందో అని భయపడుతూ ఉండేవాడు.

ఏళ్లు గడుస్తూ కుర్రాడు పెరుగుతున్న కొలదీ, అనుమానం తగ్గకపోయినా అంతగా అతన్ని బాధపెట్టేది కాదు. అప్పుడప్పుడు తప్ప-చాలా అరుదుగా.

పిల్లాడంటే మళ్లీ వీరన్నకి సరదాయే. పిల్లాడితో ఆడుకునేవాడు. పొలానికి తీసుకుపోయేవాడు. బెల్లపు మిఠాయి కొనిపెట్టూ ఉండేవాడు. పిఠాపురం సంతకి వెళ్లినప్పుడు చొక్కా గుడ్డలు తెచ్చేవాడు.

తల్లినీ, పిల్లాడినీ ఒక్కచోట చూసినప్పుడుమాత్రం ఇద్దరిలో ఎవరితోనూకూడా అంత సరదాగా ఉండేవాడు కాదు.

తన అనుమానంగురించి ఇతరవ్యక్తి ఎవరితోనూ మాట్లాడలేదు. సుందరరామయ్యగారు రెండేళ్లక్రిందట పోయేవరకూ అనేకసార్లు వచ్చి వెళ్తూఉండేవాడు. ఆయనతోకూడా ఎన్నడూ ఏమీమాట్లాడలేదు వీరన్న.

వీరన్నకి అయిదేళ్ల తర్వాత కూతురు పుట్టింది. కూతురుకి-రామికి వంకరచిటికెనవేళ్లు లేవు.

కొడుక్కి సుమారు ఏడేళ్లొచ్చాయి.

*　　　*　　　*

ఒకనాడు రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చి తిండి తిని, కాసేపు కునుకుపట్టి, అర్ధరాత్రి లేచి మళ్లీ కొబ్బరితోటకు బయలుదేరేవేళకి పడుకున్న కొడుకుని చూసేడు. వంకరచిటికెనవేళ్లు వెక్కిరిస్తూ కనబడ్డాయి. ఆరోజున పొగలంతా కొబ్బరికాయలు దింపుతూ, శ్రమపడి, సాయింత్రం మామూలుకంటె కొ త్త ఎక్కువ తాగేడుకూడాను వీరన్న. వెర్రెక్కిపోయిందానాడురాత్రి వీరన్నకి. కాని హఠాత్తుగా అక్కడికక్కడే చంపేసెయ్యలేదు. కొబ్బరితోటకి తిన్నగా వెళ్లకుండా గుడిసెఅవతల చీకట్లో కాచుకుని కూర్చున్నాడు, కత్తిపట్టుకుని. ఒకరాత్రివేళ సగంనిద్రలో ఉన్న కుర్రాడులేచి పయికివచ్చినప్పుడు నోట్లో గుడ్డలు కుక్కేసి, దూరానికి లాక్కుపోయి, మెడ నరికేసి, శవాన్ని పొదలలో పారేసేడు.

పిల్లాడు పోయాక ఒకనాడు లక్ష్మాయి, తన మీద ఒకప్పుడు వీరన్న అనవసరంగా అనుమానం పెట్టుకోడంవల్లనే పిల్లాడిలా చచ్చిపోయాడనిఏడ్చింది.

"అదేమన్నమాట" అన్నాడు వీరన్న.

నిజానికి వీరన్నఅనుమానం చాలా పొరపాటు. లక్ష్మాయిఎన్నడూ మరొకమొగవాడిగురించి ఆలోచించనైనా ఆలోచించలేదు. చచ్చిపోయిన నాగన్న వీరన్న కొడుకే. కాని నాగన్నకి వీరఘుంటలవారి రక్త సంబంధం లేకపోలేదు. ఆవంకరచిటికినవేళ్లు వీరఘుంటలవారి వంకరచిటికినవేళ్లే.

వీరన్నతండ్రి ముసలయ్య పెద్దవాడయాక పెళ్లి చేసుకున్నాడు వీరన్నతల్లి సుబ్బిని. ముసలయ్యకి ఏభైఏడేళ్లు. సుబ్బికి పదహారు. సుందరరామయ్యగారు భార్యపోయి మూలపేటలో మకాములు మొదలుపెట్టే వేళకి ముసలయ్య ఆయన రైతు. సుందరరామయ్యగారు ఈబంగళాలో వచ్చి ఉండేటప్పుడు ముసలయ్య, సుబ్బీ బంగళాకి నాలుగైదువందలగజాలదూరంలోఉన్న గుడిసెలో ఉండేవారు. సుందరరామయ్యగారు ఆరోజులలో తనవంట తనే చేసుకునేవాడు. పైపనులు సుబ్బి చేసిపెట్టూ ఉండేది. ముసలయ్యకి రానురాను ఉబ్బసమూ, క్షయా పట్టుకున్నాయి. ఆఖరి రెండుమూడు నెలలూ ముసలయ్య మంచంమీదనుంచి కదలడంకూడా తగ్గించేసేడు. సుబ్బికి తెలవని తలంపుగా సుందరరామయ్యగారితో సంబంధం ప్రారంభమయింది. తప్పనిసరి అయింది. ముసలయ్యపోయిన అయిదునెలలకి పుట్టేడు వీరన్న. ముసలయ్యకి మాత్రం పుట్టలేదు. అందరూ ముసలయ్యకొడుకే అని భావించారు. ఎవరికీ అనుమానమైనా కలుగలేదు. సుందరరామయ్యగారికీ, సుబ్బికీ మాత్రం తెలుసును.

వీరన్నకి రాని వీరఘుంటలవారి వంకర చిటికిన వేళ్లు వీరన్నకొడుక్కి వచ్చాయి. కూనీకి కారణం అయాయి.